# నత్తనడకన సర్వీసు రోడ్డు పనులు

## ప్రజలకు తప్పని తిప్పలు



కంకర తేలి అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్డు

చౌటుప్పల్ , జూన్ 18 : పట్టణకేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైవుల నిర్మిస్తున్న సర్వీసు రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు మొదలు పెట్టి ఏడాది కావస్తున్నా అసంపూర్తిగానే మిగిలిపోతున్నాయి. పనులు వేగవంతం చేయకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురిచింది. ఎక్కడ చూసినా పూర్తి కాని పనులు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎలిమినేటి మాధవరెడ్డి బీఈడీ కాలేజీవరకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా మొదట ఇరువైవుల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. నాణ్యత లేని డ్రైనేజీ పనులు చేపట్టడంతో అక్కడక్కడ వాహనాలు తిరిగితేనే కూలుతున్నాయి. తర్వాత సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించారు. అయినా కొన్నిచోట్ల పనులు చేయడం.. మరికొన్ని చోట్ల వదిలేస్తున్నారు. తంగడపల్లి రోడ్డు నుంచి స్థానిక వ్యవసాయ మార్కెట్ వరకు గత నాలుగు నెలల కింద కంకర పరిచి వదిలేశారు. దీంతో వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు చినుకు పడిందంటే రోడ్లన్నీ చెర్వులను తలపిస్తున్నాయి. బస్ స్టాండ్, నాగులకుంట సమీపంలో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. పనులు వేగవంతం చేసి త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

### పనులు పూర్తి చేయడం లేదు



నెలలు గడస్తున్నా సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేయడం లేదు. దీంతో రోడ్డుపై బండి నడపాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పనుల నిమిత్తం బయటకు వస్తే ఎక్కువ సమ యం పడుతోంది. ఆదివారం సంత రోజు ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పనులు తొందరగా పూర్తి చేయాలి.

**సాయిలు, వాహనదారుడు, చౌటుప్పల్**

### సగం పనులతో ఇబ్బందులు పడుతున్నాం



సర్వీసు రోడ్డు పనులు సగం సగం చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై దుమ్ము రావడంతో వ్యాపారం జరగడం లేదు. డ్రైనేజీలు కూడా అక్కడక్కడ దుర్వాసన వస్తోంది. దీంతో పోయినా దసరా పండుగ ముందు నుంచి వ్యాపారాలు సక్రమంగా సాగడం లేదు. బతకడం కష్టంగా మారింది.

**ఉయ్యాల యాదయ్య, చిరువ్యాపారి**

# రైతుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

## కలెక్టర్ హనుమంతరావు



గుట్టలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట, జూన్ 18: రైతుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. దీనికోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. సదస్సులో రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ చట్టంపై గ్రామ సభల్లో రైతులు అవగాహన పెంచుకుని వారి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, డిప్యూటీ తహసీల్దార్ మాదాసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకుందాం

## డీఈవో సత్యనారాయణ



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న ట్రస్టీ రవి, డీఈవో సత్యనారాయణ

సంస్థాన్ నారాయణపురం, జూన్18 : దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 350 మంది విద్యార్థులకు రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి రూ.3 లక్షలా 50 వేల విలువ గల స్కూల్ బ్యాగ్స్, షూస్, క్రీడా వస్తువులు డీఈవో సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రవిని ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉష, ఉదయ, శివరంజని, శివారెడ్డి పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్

# మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్వీ వినతి

చౌటుప్పల్ , జూన్ 18 : స్కూల్ భవనాలకు ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసు కోవాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్ అన్నారు. అనంతరం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నర్సింహ్మారెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని నారాయణ స్కూల్, అంబిటాస్, శ్రీ చైతన్య తదితర పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గం అధ్యక్షుడు నలపరాజు రమేశ్, ప్రధానకార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి, నాయకులు గంగాదేవి శివ, నోముల సుకుమార్ రెడ్డి, మహ్మద్ అలి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మయ్యకు నివాళులర్పించిన వస్పరి



లక్ష్మయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆలేరు మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య

ఆలేరు టౌన్, జూన్ 18 : భువనగిరి టౌన్ సీఐ రమేష్ తండ్రి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య బుధవారం చెన్నకేశవపురం గ్రామానికి చెందిన భువనగిరి సీఐ రమేశ్ నివాసానికి వెళ్లి ఆయన తండ్రి లక్ష్మయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట యాట సతీష్, ఆలేరు పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ కటకం బాలరాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మిషన్ భగీరథనీటి సరఫరాలో అంతరాయం

భువనగిరి అర్బన్, జూన్ 18 : యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు మండలాల్లోని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో నేడు 19వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 20 ఉదయం ఆరు వరకు అంతరాయం కలుగుతుందని జిల్లా మిషన్ భగీరథ కార్యనిర్వాహ శాఖ ఇంజనీర్ పి.కరుణాకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరాలో భాగంగా డీఐ 350 ఎంఎంలైన్ మార్పు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా అంతరాయం కలుగుతుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండలంలోని 26 గ్రామాలు, మోటకొండూరు మండలంలోని 10 గ్రామాలు, భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి మండలంలో ఐదు గ్రామాలు, వలిగొండ మండలంలో మూడు గ్రామాలకు గోదావరి నుంచి వచ్చే మంచినీటి సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. గోదావరి నీటి సరఫరా నిలిపివేస్తున్నందున ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలియజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FOR SALE
★ సూర్యాపేట పాత మెయిన్ రోడ్డులో 600 చ||గజాల నాగేంద్ర కిరాణం, శ్రీనివాసు అపరాల షాపు వెనుక Sale / Development చేయుటకు గలదు. సంప్ర : 9848948440

PLOT FOR SALE
★ సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |


# ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

## జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి



ఆయిల్‌పామ్ సాగు కోతను ప్రారంభిస్తున్న సుభాషిణి

తుర్కపల్లి, జూన్ 18 : రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహ్మారెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో రైతు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో నాలుగు ఎకరాల్లో వేసిన ఆయిల్‌పామ్ పంటకోతను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే తుర్కపల్లి రైతు క్షేత్రంలో పండిన ఆయిల్ పామ్ మొదటికోత అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు పంట సాగుకు నిధులు అందించిందన్నారు. రైతులకు ఎకరాకు సంవత్సరానికి రూ.4 వేల 200 తదితర పనులకు డబ్బులు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు ఒక్క మొక్కకు 20 చెల్లిస్తే ప్రభుత్వమే మొక్కలు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,400 ఎకరాలు, మండలంలో రెండు వందల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేసి మంచి లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, మాజీ సర్పంచ్ పడాల చంద్రం, కల్లురి చిన్న నర్సింహ్మారెడ్డి, అగ్రికల్చర్ అధికారులు స్నేహిత, కవిత, మాధవి, స్రవంతి, జిల్లా ఆయిల్‌ఫెడ్ మేనేజర్ ఖాజామోహినోద్దీన్, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, మౌనిక, ఏఈవో జస్సీ ఉన్నారు.



దవాఖాన గేటు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

# దవాఖాన వంద పడకలకు పెంచాలి

రామన్నపేట, జూన్ 18 : రామన్నపేట దవాఖాన స్థాయిని 100 పడకలకు పెంచి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండలకార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని దవాఖాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం చిట్యాల,భువనగిరి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 50 ఏండ్లుగా ప్రజలకు సేవలందిస్తూ దినదినాభివృద్ధి చెందాల్సిన వైద్యశాల శిథిలావస్థకు చేరిందన్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని అన్నారు. దవాఖాన సూపరింటెండెంట్ చిన్నానాయక్ తమ పరిధిలోని సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తానని, ఇతర సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. నాయకులు ఉపేందర్, అంజయ్య, ఆనంద్, హన్మంతు, నగేశ్, అండాలు, ఉపేందర్, మీర్‌ఖాజ, బాలరాజు, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న శివరాజ్‌గౌడ్



మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న శివరాజ్‌గౌడ్

భువనగిరికలెక్టరేట్, జూన్ 18 : నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్ అండగా నిలిచారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన చందుపట్ల గ్రామానికి చెందిన గుర్రం భిక్షపతి (45) కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుని కుమార్తెలకు సొంత నిధులతో చదువులకు అయ్యే ఖర్చులను పూర్తిగా భరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం శివరాజ్‌గౌడ్ మృతుని కుమార్తెలు ఇద్దరి చదువుల కోసం ప్రైవేటు పాఠశాలలో రూ.60వేలను చెల్లించి దాతృత్వం చాటుకున్నారు.

# విద్యార్థులకు మల్లారెడ్డి చేయూత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దాత మల్లారెడ్డి

ఆత్మకూరు(ఎం), జూన్ 18 : మండలంలోని 18 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 410 మంది విద్యార్థులకు బుధవారం పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన వీవీఎస్ ఎంటర్ ప్రైజెస్ అధినేత తడిసిన మల్లారెడ్డి రూ.1 లక్ష విలువ గల నోటు పుస్తకాలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం అశ్విని, ఉపాధ్యాయురాలు వీణ, గ్రామ యువకుడు ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

# క్రీడా పాఠశాలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, వ్యాయామ ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం), జూన్ 18 : రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపిక కోసం బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశం కోసం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 10 మంది విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు ప్రతిభకనబర్చడంతో ఎంపికైనట్లు ఎంఈవో మహదేవరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో, వ్యాయామ ఉపాధ్యాయులు ఇందిరా ప్రియదర్శిని, రవీందర్, రామాంజమ్మ అభినందించారు.



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

# అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

## అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 18 : అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్‌లోని బసవలింగేశ్వరకాలనీలో 120 ఇండ్లు, జిబ్లక్‌పల్లిలో 36 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు, వాటి సమస్యల గురించి ఆరా తీశారు. డబుల్ ఇండ్లలో ఆకతాయిలు కిటికీ అద్దాలు, సింథటిక్ ట్యాంకులు ధ్వంసం చేయడంతో మైనర్ రిపేరింగ్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలో అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీ వో శేఖర్‌రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ గుత్తా వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# భూభారతి సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరికలెక్టరేట్, జూన్ 18 : ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. అనంతారం గ్రామంలో బుధవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందని రైతులు భూసమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ అంజిరెడ్డి, ఆర్ఐ బలరాం, రైతులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలకు సౌండ్‌బాక్స్‌ల బహూకరణ

ఆత్మకూరు(ఎం), జూన్ 18 : పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు బీఆర్ఎస్ నాయకుడు గ్రామ మాజీ సర్పంచ్ గణగాని మాధవి రూ.10వేల విలువ గల సౌండ్‌బాక్స్‌లను బుధవారం పాఠశాలకు బహూకరించారు. గ్రామంలోని బడీడు పిల్లలందరూ పాఠశాలకు చేరి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర సంక్షేమ సంఘం కార్యదర్శి గణగాని మల్లేశంగౌడ్, నర్సయ్య, విజయలక్ష్మి దశరథ పాల్గొన్నారు.

# భవిత కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 18 : భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ విద్యార్థులను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి రెండు రోజులు ఫిజియోథెరపీ క్యాంప్ ఉంటుందని అన్నారు. భవితకు వచ్చే దివ్యాంగ విద్యార్థులకు ట్రాన్స్పోర్ట్ అలవెన్స్, తల్లిదండ్రుల సాయంతో వచ్చి విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్ నెలకు రూ.350ల చొప్పున ఇస్తుందని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఐఈ ఆర్ పీ సుధామణి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి : ఆర్డీవో శేఖర్‌రెడ్డి

వలిగొండ జూన్ 18 : రైతుల భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడుతూ రైతుల భూ భారతి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి వివిధ భూ సమస్యల పై దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ దశరథ, డిప్యూటీ తహసీల్దార్ పల్లవి, రెవెన్యూ అధికారులు కరుణాకర్‌రెడ్డి, మనోహర్, నగేశ్, రైతులు పాల్గొన్నారు.

# కులం పేరుతో తిట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

మోత్కూరు, జూన్ 18: పాలడుగులో దళితులను కులం పేరుతో తిట్టి కాళ్లు మొక్కించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా అన్నారు. పాలడుగులో దళిత కుటుంబాలకు చెందిన గంగయ్య, శ్రీరాములు, స్వామిలకు చెందిన భూములను పరిశీలించారు. గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 81లో 2.32 ఎకరాలను కొంపెల్లి పోచయ్య పట్టా సర్టిఫికెట్ ఇచ్చిందన్నారు. అదే భూమిని ఆనుకుని ఉన్న ఉదయ్‌రాజురెడ్డి, సత్తిరెడ్డిలు తన పొలానికి వెళ్లడం కోసం నక్షాబాటను వదిలి దళితుల భూముల నుంచి బాట కావాలని అధికారులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు.

# నీటిపారుదలశాఖ ఏఈలుగా పవన్, అభిరాంరెడ్డి

ఆత్మకూరు(ఎం), జూన్ 18 : నీటి పారుదలశాఖ ఏఈలుగా పవన్, అభిరాంరెడ్డిలు బుధవారం విధులు చేపట్టారు. ఇందులో భాగంగా రెవెన్యూ క్లస్టర్ గ్రామాలైన ఆత్మకూరు(ఎం) కాల్వపల్లి, సింగారం, కోరటికల్, కూరెళ్ల, లింగరాజ్‌పల్లి , మొరిపిరాల, పల్లెర్ల, రాఘవాపురం, తుక్కాపురం గ్రామాలను ఏఈ పవన్ పర్యవేక్షణలో ఉండగా కప్రాయపల్లి, పల్లెపహాడ్ , పారుపల్లి, రహీంఖాన్‌పేట, రాయిపల్లి, సర్వేపల్లి గ్రామాల్లో అభిరాంరెడ్డి పర్యవేక్షణ చేయనున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌటుప్పల్, జూన్ 18 :మండల పరిధిలోని తంగడపల్లి, లక్కారం, కొయ్యలగూడెం, ఎల్లగిరి, ఎల్లంబావి తదితర గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజుల సతీశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తంగడపల్లి రోడ్డు, కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 6నుంచి9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# కొనసాగుతున్న భూ భారతి సదస్సులు

బీబీనగర్, జూన్ 18 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతి కార్యాలయం ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ భగత్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది సురేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు

మోత్కూరు, జూన్ 18: మోత్కూరు ఇన్‌స్పెక్టర్‌గా వెంటేశ్వర్లును నియామకం చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్సై నాగరాజు ముశిపట్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య గ్రామంలోని వాట్సాప్ గ్రూప్‌లో చోటు చేసుకున్న వివాదంలో అతడిని ఈ నెల 14న హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులోఎస్‌బీ రాచకొండలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశర్లును భర్తీ చేస్తూ సుధీర్‌బాబు ఉత్తర్వులను జారీ చేశారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిపారు.

# నేడు వాసాలమర్రికి మంత్రిపొంగులేటి రాక

తుర్కపల్లి, జూన్ 18 :వాసాలమర్రి గ్రామానికి గురువారం రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలు రానున్నారు. బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , కలెక్టర్ హనుమంతరావుతో సభ నిర్వహణ కోసం స్థల పరిశీలన చేశారు. గ్రామంలో మొత్తం 227మంది లబ్ధిదారులకు మంత్రి చేతులమీదుగా ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్య, తహసీల్దార్ దేశ్యా తదితరులున్నారు.

# ఈతకు వెళ్లి యువకుడి మృతి

బీబీనగర్, జూన్ 18 : ఈత కొట్టడానికి వెళ్లి యువకుడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌కు చెందిన వెల్ల నందకుమార్ (23) బుధవారం యాదగిరిగుట్టకు దర్శనానికి వెళ్లాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో బీబీనగర్‌కు చేరుకోగానే జాతీయ రహదారి పక్కన ఉన్న చెరువులో ఈత కొట్టడానికి దిగాడు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.